
సాక్షి యాదాద్రి భువనగిరి

గురువారం । 16 । అక్టోబర్ । 2025



రాచకొండలో భూములివ్వాలి
రీజినల్ రింగ్ రోడ్డు బాధితులకు పరిహారంగా రాచకొండలోని భూములు ఇవ్వాలని పల్లా వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. - 10లో



కొనుగోళ్లకు ఎదురుచూపులు
జిల్లాలో వరి కోతలు ప్రారంభమై రెండు వారాలు గడిచినా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం లేదు. - 11లో



బంద్‌ను విజయవంతం చేయాలి
బీసీ రిజర్వేషన్ల సాధన కోసం 18న నిర్వహించే బంద్‌ను జయప్రదం చేయాలని బీసీ సంఘాల నాయకులు కోరారు. - 11లో

న్యూస్‌రీల్

నివేదికలు ఇవ్వండి

సాక్షి, యాదాద్రి : గనులు, క్వారీల మంజూరీకి పర్యావరణ అనుమతులు మంజూరు చేయడానికి రాష్ట్రస్థాయి పర్యావరణ ప్రభావ అధ్యయన సంస్థ (సియా)కు సంబంధించిన జిల్లా సర్వే నివేదిక సంకలన కమిటీ సమావేశం బుధవారం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. కమిటీ సభ్యులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. నిర్దేశించిన గడువులోపు నివేదికలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంటల సర్వే



బొందుగుల గ్రామంలో పంటల వివరాలు సేకరిస్తున్న జాతీయ గణాంక శాఖ అధికారులు

రాజాపేట: మండలంలోని బొందుగుల గ్రామంలో బుధవారం జాతీయ గణాంక అధికారులు పంటల సర్వే నిర్వహించారు. వర్షాధార పంటలు, బోరుబావుల ద్వారా సేద్యం చేసే పంటల వివరాలు నమోదు చేసుకున్నారు. సర్వే ద్వారా దేశంలో పంటల విస్తీర్ణం, సాగు ఎగుమతి, దిగుమతుల వివరాలు తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అంజయ్య, రైతులు పాల్గొన్నారు.

బిల్ కలెక్టర్ సస్పెన్షన్‌కు ఆదేశం



సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

ఆలేరు: మున్సిపల్ సిబ్బంది కొందరు విధులకు గైర్హాజరు కావడంతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు ఆగ్రహం వేశారు. బిల్ కలెక్టర్ సస్పెన్షన్‌కు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం ఆయన ఆలేరు మున్సిపల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కొన్ని రోజులుగా బిల్‌కలెక్టర్ నాగేందర్ అనధికారికంగా సెలవులో ఉన్నట్టు అదనపు కలెక్టర్ గుర్తించారు. ఈ విషయమై మున్సిపల్ మేనేజర్‌ను ప్రశ్నించగా అనారోగ్యం వల్ల విధులకు రావడం లేదని వివరణ ఇచ్చారు. అనుమతి తీసుకోకపోవడంతో సస్పెన్షన్‌కు ఆదేశించారని, ఈ మేరకు నివేదిక అందజేయనున్నట్టు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు.

నేత్రపర్వంగా యాదగిరీశుడి నిత్యకల్యాణం

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో నిత్యారాధనలో భాగంగా స్వామి, అమ్మవారి నిత్యకల్యాణాన్ని అర్చకులు ఆగమ శాస్త్రానుసారం నేత్రపర్వంగా చేపట్టారు. బుధవారం వేకువజామున ఆలయాన్ని తెరచిన అర్చకులు స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాతం సేవ చేపట్టి, గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణం వేడుక జరిపించారు. ఆ తరువాత బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామివారికి శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం గావించారు.

● మంచు దుప్పటి



భూదాన్‌పోచంపల్లి : మండలంలోని పల్లెలను బుధవారం మంచుదుప్పటి కప్పేసింది. తెల్లవారుజాము నుంచి దట్టమైన పొగమంచు అలుముకొని వాతావరణం చల్లగాలులతో ఆహ్లాదం పంచింది. ప్రజలు పొగమంచులోనే తమ దైనందిన కార్యక్రమాలు నిర్వహించారు.

ధాన్యం కొనుగోళ్లకు పటిష్ట ఏర్పాట్లు

భువనగిరిటౌన్ : వానాకాలం ధాన్యం సేకరణకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. బుధవారం రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావుతో కలిసి ధాన్యం కొనుగోళ్లపై హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్లపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, సివిల్ సప్లై మేనేజర్ హరికృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి రమణారెడ్డి, డీటీఓ సాయికృష్ణ, కో–ఆపరేటివ్ అధికారి శ్రీధర్, మార్కెటింగ్ అధికారి సవిత తదితరులు పాల్గొన్నారు.

సెల్లార్.. రూల్స్ బలాదూర్!

వ్యాపార, వాణిజ్య అవసరాలకు వినియోగం

- వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు
- ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- తరచూ ప్రమాదాలు
- ఉల్లంఘనులకు నోటీసులు జారీ చేస్తున్న అధికారులు



భువనగిరిలో ప్రధాన రహదారి పక్కన భవనాల ముందు పార్కింగ్ చేసిన వాహనాలు

సాక్షి, యాదాద్రి: జిల్లా కేంద్రం భువనగిరిలో ప్రధాన రహదారిపై పార్కింగ్ ప్రధాన సమస్యగా మారింది. రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన బహుళ అంతస్తుల భవనాల సెల్లార్‌లు దుర్వినియోగం అవుతున్నాయి. పార్కింగ్ కోసం నిర్మించిన సెల్లార్‌లు నివాస, వాణిజ్య, వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నారు. దీంతో ఆయా భవనాలు ఎదుట వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. హైదరాబాద్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వర కు దాదాపు 30 చోట్ల బహుళ అంతస్తుల భవన యజమానులు సెల్లార్ నిబంధనలు అతిక్రమించారు.

ఉల్లంఘనుల గుర్తింపు

జగ్‌దేవ్‌పూర్ చౌరస్తాలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాల్లో పలువురు మృతి చెందారు. ఈ క్రమంలో స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించారు. పార్టీల ప్రతినిధులు, ప్రజా సంఘాలు, వివిధ వర్గాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించారు. జగ్‌దేవ్‌పూర్ చౌరస్తా మృత్యుకుహరంగా మారిందని, వెడల్పు చేయాలని అన్ని వర్గాలు కోరాయి. అలాగే ప్రధాన రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రమాదాలు పెరిగాయని, వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకుపోయారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు రంగంలోకి దిగారు. ఎలాంటి అనుమతులు లేకుండా సెల్లార్ నిర్వహించిన ఓ భవన యజమానికి మున్సిపల్ అధికారులు నోటీసు ఇచ్చారు. ప్రధాన రోడ్డుకు ఇరువైపులా సెల్లార్ నిబంధనలను ఉల్లంఘించిన వారిని గుర్తించారు. వారికి కూడా నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవడానికి సిద్ధమవుతున్నారు.

ఇతర అవసరాలకు వినియోగం

అనుమతించిన సెల్లార్‌లలో పార్కింగ్ స్థలాన్ని ఇతర వినియోగాలకు మార్చారు. ఇలా చేసిన నిర్మాణాన్ని మున్సిపాలిటీలు తక్షణమే తొలగించవచ్చు. టీజీబీపాస్ ద్వారా ఆన్‌లైన్‌లో అనుమతులు పొందిన భవనాలు ఆమోదిత ప్లాన్‌లో చూపిన సెల్లార్ పరిమాణం, ర్యాంప్, సెట్‌బ్యాక్, ఫైర్ యాక్సెస్‌ను కచ్చితంగా పాటించాలి. కానీ, అంతటా నిబంధనల ఉల్లంఘనలు జరిగాయి.

అన్నీ విరుద్ధంగానే..

సెల్లార్ అనుమతి ఉన్న చోట భవనం ఎత్తు లెక్కింపులో సెల్లార్‌ను కలపరు. అయితే నేలమట్టం దిగువ నిర్మాణాలు తప్పనిసరిగా నిబంధనల ప్రకారం, సెట్‌బ్యాక్‌లకు భంగం కలిగించకుండా ఉండాలి. కానీ, చాలా చోట్ల ఆ విధంగా లేవు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

సెల్లార్‌లలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా డ్రెయినేజీలు, సంపులు, పంపింగ్ ఏర్పాటు చేయాలి. వర్షాకాలంలో నీరు నిలువ ఉండకుండా, గోడల కూలడం వంటి ప్రమాదాలు జరగకుండా మున్సిపాలిటీలు నిరంతరం తనిఖీలు చేయాలి.

సెల్లార్.. పార్కింగ్ కోసమే

మునిసిపాలిటీల్లో 'సెల్లార్ బేస్‌మెంట్' అనేది పార్కింగ్ కోసం అనుమతిస్తారు. సెల్లార్‌లో నివసించడం, వ్యాపార సముదాయాల ఏర్పాటు, గిడ్డంగుల కోసం వాటిని వినియోగించవద్దు. అలాగే సెల్లార్ నిర్మాణం, తవ్వకాల సమయంలో భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలి.అయితే నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సెల్లార్‌లను అధికారులు పట్టించుకోవడం లేదు. పార్కింగ్ కోసం వినియోగించాల్సిన సెల్లార్‌లను వ్యాపార, వాణిజ్య అవసరాలకు వాడుతున్నారు. బహుళ అంతస్తుల భవనాల్లో అనుమతించే సెల్లార్లకు పరిమితి ఉంది. ప్రస్తుతం జరుగుతున్న కొన్ని ప్రమాదాల నేపథ్యంలో సెల్లార్‌లను పరిమితం చేయడం లేదా రద్దు చేసే ప్రతిపాదనలు ప్రభుత్వ స్థాయిలో పరిశీలనలో ఉన్నాయి.

డయల్ 112

అత్యవసర సహాయానికి ఒక్కటే నంబర్

- జీపీఎస్ ద్వారా బాధితుల లొకేషన్ గుర్తింపు
- ఏహెచ్‌టీయూ, పోలీసుల ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు

ఆలేరు: ఒకే దేశం, ఒకే అత్యవసర నంబర్ నినాదంతో కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన డయల్ 112పై హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ), పోలీసు శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు ఆలేరు, భువనగిరి, యాదగిరిగుట్ట, రాజాపేట, గుండాల, బీబీనగర్ మండలాల పరిధిలోని పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు 112 నంబర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నంబర్‌తోపాటు సైబర్‌నేరాలు, బాల్యవివాహాల నిర్మూలన, రోడ్డు ప్రమాదాలు, మహిళలు, పిల్లల భద్రత, హ్యూమన్ ట్రాఫికింగ్, మత్తుపదార్థాల రవాణా నిరోధం, కొత్త చట్టాలపైనా ప్రచారం చేస్తున్నారు. అత్యవసర సహాయ సేవల పర్యవేక్షణకు ప్రభుత్వ ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసింది.

గతంలో వేర్వేరు సేవలకు విభిన్న నంబర్లు

పోలీసుల సహాయ కోసం 100, బాలల రక్షణకు 1098, వైద్య సహాయానికి అంబులెన్స్ కావాలంటే 108, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు 101.. ఇలా వేర్వేరు అత్యవసర సేవలకు విభిన్నమైన నంబర్లు ఉండేవి. ఇకపై ఎలాంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా కేవలం 112కు ఫోన్ చేస్తే సరిపోతుంది. ఈ వ్యవస్థ ప్రజలకు సహాయాన్ని చేరువ చేయడమే కాకుండా వేగవంతమైన రెస్పాన్స్ అందిస్తుంది.



ఫోన్ చేయలేని పరిస్థితుల్లో.. సెల్‌ఫోన్ పవర్ బటన్ నొక్కాలి

112 నంబర్ 24గంటలు పని చేస్తోంది. బాధితులకు వివిధ భాషల్లో మద్దతు లభిస్తుంది. తమ సెల్‌ఫోన్‌తోపాటు ల్యాండ్ ఫోన్ నుంచి 112కు డయల్ చేయొచ్చు. ఫోన్ చేయలేని పరిస్థితిలో ఉంటే తమ సెల్‌ఫోన్‌లో పవర్ బటన్‌ను మూడుసార్లు నొక్కితే ఆటోమేటిక్‌గా 112కు కాల్ వెళ్లి, కావాల్సిన సహాయం బాధితులకు అందుతుందని ఏహెచ్‌టీయూ సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ 'సాక్షి'తో చెప్పారు.



ఆలేరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు 112పై అవగాహన కల్పిస్తున్న పోలీస్

నూతన వ్యవస్థలో జీపీఎస్ కీలకపాత్ర

నూతన వ్యవస్థల్లో జీపీఎస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) కీలకపాత్ర పోషిస్తుంది. ఎవరైనా 112కు ఫోన్ చేసిన వెంటనే, వారి కచ్చితమైన స్థానాన్ని గుర్తించి, సమీపంలో అందుబాటులో ఉన్న ఎమర్జెన్సీ రెస్పాన్స్ బృందాలను వెంటనే సంఘటన స్థలానికి పంపేలా ఈ వ్యవస్థను రూపొందించారు. సహాయం అందే వరకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని బాధితులకు అప్‌డేట్ చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో అధికారులను కమాండ్ కంట్రోల్ రూం మానిటరింగ్ చేస్తుంది. సంఘటనా స్థలానికి వెళ్లిన సిబ్బంది తమ ట్యాబ్ ద్వారా తిరిగి క్లియరెన్స్ సమాచారం ఇచ్చే వరకు కంట్రోల్‌రూం సిబ్బంది పర్యవేక్షణ చేస్తుంది.

ఇకపై కొత్త నంబర్‌కే కాల్ చేయాలి



సీపీ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు ఏహెచ్‌టీయూ సిబ్బంది, స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో 112 నంబర్‌ను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. రోడ్డు ప్రమాదాలు, వైద్య, పోలీసు,అగ్నిమాపక తదితర అత్యవసర సహాయం కోసం ప్రజలు ఇకపై కొత్త నంబర్‌కే ఫోన్ చేయాలి. –యాలాద్రి, ఆలేరు సీఐ

ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఐలయ్య

ఆలేరురూరల్ : రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తామని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆలేరు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలూ తావుండరాదని, రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణకు ప్రభుత్వం రూ.25 వేల కోట్ల బడ్జెట్ కేటాయించిందన్నారు. కొనుగోలు చేసిన వడ్లకు 12 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామన్నారు. వర్షాలకు ధాన్యం తడిసి నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. సన్నరకం వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని, పాత బకాయిలతో కలిపి త్వరలో రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు వెల్లడించారు.

గత పాలకుల తప్పిదాల వల్లే మదర్ డెయిరీకి నష్టాలు : బీర్ల ఐలయ్య

గత పాలకుల తప్పిదాల వల్ల మదర్ డెయిరీ నష్టాల్లోకి వచ్చిందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య విమర్శించారు. సంస్థను లాభాల్లోకి తీసుకురావడానికి నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ వారితో చర్చలు నడుస్తున్నాయని తెలిపారు. దీపావళి నాటికి రైతులకు పాల బిల్లులు అందే విధంగా చర్యలు తీసుకుంటానని చెప్పారు. అనంతరం కొల్లూరు, మందనపల్లిలో కొనుగోలు కేంద్రాలను బీర్ల ఐలయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఐనాల చైతన్య, పీఏసీఎస్ చైర్మన్ మొగులుగాని మల్లేషం, వెంకటేశ్వరరాజు, ఆరె ప్రశాంత్, గంధమల్ల అశోక్, నీలం పద్మ, కట్టెగొమ్ముల సాగర్ రెడ్డి, తుంగకుమార్, బుగ్గ నవీన్, గాజుల వెంకటేష్, శ్రీకాంత్, కర్రె అజయ్, ఎఫ్‌పీవో నిర్వాహకులు వస్పరి స్వామి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు



తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

- కలెక్టర్ హనుమంతరావు

బొమ్మలరామారం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. బొమ్మలరామారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను బుధవారం ఆయన పరిశీలించారు. లబ్ధిదారులకు సూచనలు చేశారు. నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం భారం కావద్దన్న ఉద్దేశంతో సమభావన సంఘాల నుంచి రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయని చెప్పారు. అంతకు ముందు తహసీల్దారు కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు.ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం జరగకుండా చూడాలని, అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దారు శ్రీనివాసరావుకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసరావు, ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్, డిప్యూటీ తహసీల్దార్ సునీల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బైసు రాజేష్, ఎంఆర్ఐ వెంకట్ రెడ్డి, ఎస్ఐ బుగ్గ శ్రీశైలం, వెలుగు ఏపీఎం యాదగిరి, నాయకులు శ్రీరాములు నాయక్, రామిడి జంగారెడ్డి, ఈశ్వర్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

వలిగొండ : బాల్య వివాహాలను నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ దశరథ అన్నారు. బాలికా దినోత్సవం సందర్భంగా బుధవారం చైల్డ్ హెల్ప్ లైన్, జస్ట్ రైట్ ఫర్ చిల్డ్రన్, స్కోప్ సంస్థ ఆధ్వర్యంలో వలిగొండ మండలంలోని లోతుకుంట ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిన్నతనంలో పెళ్లి చేయడం వల్ల అనేక అనర్థాలు వస్తాయన్నారు. బాలికా విద్యను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో భార్గవి, సోమ నరసయ్య, రాయిస్ ఉన్నిసా తదితరులు పాల్గొన్నారు.

రూ.కోట్లు ఖర్చు.. వినియోగిస్తే ఒట్టు

వృథాగా మోటకొండూరు వ్యవసాయ సబ్ మార్కెట్

- నిర్మించి ఏడేళ్లు గడిచినా మొదలుకాని క్రయవిక్రయాలు
- దళారులను ఆశ్రయిస్తున్న రైతులు
- కొనుగోళ్లు ఇక్కడే చేయాలని వేడుకోలు



మోటకొండూరు సబ్ మార్కెట్ యార్డ్

మోటకొండూర్: రైతులు పండించే వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించేలా, దళారీల నుంచి వారిని కాపాడాలన్న ఉద్దేశంతో మోటకొండూరులో ఏర్పాటు చేసిన వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డు రైతులకు ఏమాత్రం ఉపయోగపడటం లేదు. కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించినా ఫలితం లేకుండాపోయింది. ఏడేళ్లయినా అక్కడ క్రయవిక్రయాలు జరగడం లేదు. వినియోగంలోకి తీసుకురాకపోవడంతో వ్యాపారులు, దళారుల చేతిలో రైతులు మోసపోతున్నారు.

ఇదీ పరిస్థితి

- ◆ మోటకొండూరు మండల కేంద్రంలోని వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డుల్లో క్రయవిక్రయాలు జరగడం లేదు. ఇక్కడ 10 ఎకరాల విస్తీర్ణంలో 2018లో నాబార్డు నిధులు రూ.3 కోట్లతో సబ్ మార్కెట్ యార్డు నిర్మించారు. యార్డులో 5,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గిడ్డంగిని కూడా ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను వ్యాపారులు మార్కెట్‌లోనే కొనుగోలు చేయాల్సి ఉన్నా నిబంధనలు అమలు కావడం లేదు.
- ◆ పాత ఆలేరు, యాదగిరిగుట్ట, ఆత్మకూర్(ఎం), గుండాల మండలాల పరిధిలోని పలు గ్రామాలను విడదీసి మోటకొండూర్ నూతన మండలం ఏర్పాటు చేశారు. కానీ, సగం గ్రామాలు ఆలేరు, మోత్కూరు మార్కెట్‌ల పరిధిలో కొనసాగుతున్నాయి. దీంతో చాలా మంది రైతులు మోటకొండూరుకు కాకుండా పూర్వపు మార్కెట్‌లకు వెళ్తున్నారు. గ్రామాలన్నింటినీ మోటకొండూరు సబ్ మార్కెట్ పరిధిలోకి తీసుకువచ్చి ఇక్కడే క్రయవిక్రయాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.


అధికంగా సాగు విస్తీర్ణం ఇక్కడే..

జిల్లాలో అత్యధిక సాగు విస్తీర్ణం మోటకొండూర్ మండంలంలోనే ఉంది. ఇక్కడ 22,670 ఎకరాల సాగు భూమి, 11,617 మంది రైతులు ఉన్నారు. వానాకాలం సీజన్‌లో పత్తి 10,800, వరి 10,500, ఇతర పంటలు 1,370 ఎకరాల్లో సాగయ్యాయి. స్థానికంగా మార్కెట్ యార్డు ఉన్నా కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు ఇతర మండలాల మార్కెట్‌లకు వెళ్తున్నారు. మరికొందరు ప్రైవేట్ వ్యాపారులు, దళారులకు తక్కువ ధరకు విక్రయిస్తున్నారు.

అప్‌గ్రేడ్ చేస్తేనే ప్రయోజనం

మోటకొండూర్, ఆత్మకూర్(ఎం), యాదగిరిగుట్ట మండలాలను ఒకే గొడుగు కిందకి తీసుకువచ్చి మోటకొండూర్ సబ్ మార్కెట్ యార్డును అప్‌గ్రేడ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పటి ఎమ్మెల్యే 2022లో సిఫారస్ చేశారు. అనుమతులు ఇచ్చే వేళ మునుగోడు ఉప ఎన్నిక రావడం, అనంతరం జనరల్ ఎలక్షన్లు కారణంగా అప్‌గ్రేడేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిపాదనకు కార్యరూపం తేవాలని రైతులు కోరుతున్నారు.

ప్రస్తుత సర్కార్ పరిశీలించాలి



మార్కెట్ యార్డ్‌ను అప్‌గ్రేడ్ చేయడానికి గత ప్రభుత్వంలో ప్రతిపాదించారు. ప్రస్తుత సర్కార్ పరిశీలించాలి.అప్‌గ్రేడ్ చేయడం వల్ల మోటకొండూరుతో పాటు ఆలేరు, మోత్కూర్ మండలాల రైతులకు మేలు జరుగుతుంది. కొనుగోళ్లు జరగక పండించిన పంట దళారులకు చెందుతుంది.

–ఎగ్గిడి బాలయ్య, వంగపల్లి పీఏసీఎస్ వైస్ చైర్మన్

దళారులకు అమ్ముకుంటున్నారు



సబ్‌మార్కెట్ యార్డులో గిడ్డంగులు నిర్మించినా ప్రయోజనం లేదు. ధాన్యం, పత్తిని ఇంట్లో నిల్వ చేసుకునే పరిస్థితి లేక దళారులకు అమ్ముకుంటున్నారు. దీని ఆసరాగా తీసుకొని తక్కువ రేటుకు కొనుగోలు చే స్తున్నారు. సబ్ మార్కెట్‌ను మార్కెట్ యార్డ్‌గా మార్చాలి.

–గాదెగోని మాణిక్యం, సీపీఐ మండల కార్యదర్శి

రైతుల కల సాకారం చేసిన దాత



రోడ్డు వేయిస్తున్న దాత రాజశేఖర్‌గౌడ్



నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్డు

- పంట పొలాల వద్దకు రహదారి కోసం సొంత నిధులు ఖర్చు
- రూ.2 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణం
- 45 ఏళ్లకు సమస్య పరిష్కారం
- రైతులు, గ్రామస్తుల హర్షం

బీబీనగర్: ఉన్నత హోదాలో ఉన్న ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకోని ఈ రోజుల్లో రైతుల పడుతున్న ఇబ్బందులను చూసి వారి సమస్యను తీర్చేందుకు ముందుకువచ్చాడు ఓదాత. తన సొంత డబ్బులు రూ.2 కోట్లు ఖర్చు చేసి పంట పొలాలకు చక్కటి రోడ్డు నిర్మింపజేయించి అందరికీ ఆదర్శంగా నిలిచాడు.. గూడూరుకు చెందిన తొర్పునూరి రాజశేఖర్‌గౌడ్

4 కి.మీ మేర రోడ్డు నిర్మాణం

బీబీనగర్ మండలం గూడూరు శివారు నుంచి భువనగిరి మండలం తాజ్‌పూర్‌కు వెళ్లే పానాదిబాటగుండా 4 కి.మీ మేర గూడూరుకు చెందిన 25 మందికి పైగా రైతుల భూములు ఉన్నాయి. రెవెన్యూ రికార్డు ప్రకారం నక్షలో 33 ఫీట్ల విస్తీర్ణం రోడ్డు ఉన్నప్పటికీ ఈబాట కోసం రైతులు 45 ఏళ్లుగా ఎంపీలు, ఎమ్మెల్యేలను కలిసి విన్నవించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో రైతులు పొలాల వద్దకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. గ్రామాభివృద్ధికి తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్న తొర్పునూరి రాజశేఖర్‌గౌడ్ దృష్టికి రైతులు సమస్యను తీసుకెళ్లగా 4 కి.మీ మేర 30 ఫీట్ల విస్తీర్ణంతో సీసీ రోడ్డు నిర్మించేందుకు ముందుకు వచ్చాడు.

పది రోజుల్లోనే పూర్తి

రోడ్డు కోసం రాజశేఖర్‌గౌడ్ రూ.2 కోట్లు ఖర్చు చేశాడు. నాణ్యమైన మెటీరియల్ వినియోగించి కేవలం పది రోజుల్లోనే రోడ్డు వేయించాడు. రోడ్డు కోసం రైతులు తమ భూముల్లో కొంత వదులుకున్నారు. రోడ్డు నిర్మాణంతో తమ సమస్య తీరిందని రైతులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇన్నాళ్లు ఎవ్వరూ పట్టించుకోలేదు



పొలాలకు వెళ్లేందుకు రోడ్డు లేక 45 ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. మా గ్రామస్తుడు శేఖర్‌గౌడ్ రైతుల ఇబ్బందులు చూసి తన సొంత డబ్బులతో 4 కిలో మీటర్ల మేర సీసీ రోడ్డు వేయించాడు. శేఖర్‌గౌడ్‌కు రైతులంతా రుణపడి ఉంటాం.

–యాదిరెడ్డి, రైతు, గూడూరు

గ్రామాభివృద్ధికి నావంతు తోడ్పాటు



గ్రామంపై ఉన్న మమకారంతో అభివృద్ధికి నావంతు తోడ్పాటునందిస్తున్న. పొలాలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో రైతులు సమస్యను నా దృష్టికి తీసుకువచ్చారు. దీంతో నా సొంత డబ్బులు రూ.2 కోట్లు వెచ్చించి నాలుగు కిలో మీటర్ల మేర సీసీ రోడ్డు వేయించా.

–తొర్పునూరి రాజశేఖర్‌గౌడ్, రోడ్డు నిర్మాణ దాత, గూడూరు

క్లుప్తంగా

రూపాయికి బీఎస్ఎన్ఎల్ సిమ్‌కార్డు

రామగిరి(నల్లగొండ): దీపావళి పండుగకు రూపాయికి బీఎస్ఎన్ఎల్ సిమ్‌కార్డు ఆఫర్ ప్రవేశపెట్టినట్లు ఆ సంస్థ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. దీపావళి ప్రత్యేక పథకం ద్వారా ఒక్క రూపాయి ప్రీపెయిడ్ సిమ్‌కార్డుతో నెల రోజుల పాటు అన్ని నెట్‌వర్క్‌లకు అపరిమిత కాల్స్, రోజుకు 2 జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఆఫర్ కొత్తగా ప్రీపెయిడ్ సిమ్ తీసుకునే వారికి, పోర్టబులిటీ ద్వారా బీఎస్ఎన్ఎల్‌లోకి మారే వారికి వర్తిస్తుందని తెలిపారు.

మహిళ అదృశ్యం

భువనగిరి: మండలంలోని వడాయిగూడెం గ్రామంలో మహిళ అదృశ్యమైంది. గ్రామానికి చెందిన బబ్బూరి శంకరయ్య బుధవారం ఉదయం 10.30 గంటలకు పని నిమిత్తం యాదగిరిగుట్టకు వెళ్లి తిరిగి వచ్చాడు. ఇంట్లో భార్య ఉమారాణి కనిపించకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికాడు. ఎక్కడా కనిపించకపోవడంతో స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన భార్య మానసికస్థితి సరిగా లేక కొంతకాలంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలిపాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు.

జానకిపురంలో వృద్ధుడు..

అడ్డగూడూరు: అడ్డగూడూరు మండల పరిధిలోని జానకిపురం గ్రామానికి చెందిన కట్కూరి లక్ష్మయ్య (86) ఈనెల 13న ఉదయం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఈమేరకు ఆయన కుమారుడు సోమయ్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన తండ్రికి మతిస్థిమితం సరిగా లేదని తెలిపాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్ రెడ్డి తెలిపారు.

కొనసాగుతున్న గాలింపు



గాలింపు చర్యల్లో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

చందంపేట : నేరెడుగొమ్ము మండలం వైజాక్ కాలనీలోని కృష్ణా వెనుక జలాల్లో మంగళవారం యువకుడు గల్లంతు కాగా.. అతడి ఆచూకీ కోసం చేపట్టిన గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం ఖానాపురం గ్రామానికి చెందిన తిన్నారపు పృథ్వీరాజ్ హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతడు తన స్నేహితులతో కలిసి వైజాక్ కాలనీకి రాగా ఈత కోసం కృష్ణా వెనుక జలాల్లో దిగి గల్లంతయ్యాడు. ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు పృథ్వీరాజ్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగేంద్రబాబు బుధవారం తెలిపారు.

జల హోయలు



అజ్జలాపురం బుగ్గ జలపాతం వద్ద పర్యాటకుల సందడి

- కనువిందు చేస్తున్న అజ్జలాపురం బుగ్గ జలపాతం
- అటవీ ప్రాంతమంతా మొగలి పూల సువాసన

మర్రిగూడ: 2500 ఎకరాల విస్తీర్ణంలో చుట్టూ ఉన్న కొండలు, వాటి మధ్య పరుచుకున్న పచ్చదనం ప్రకృతి ప్రేమికులను ఎంతో మైమరపింపజేస్తోంది. అక్కడే కొలువుదీరిన బుగ్గ శ్రీలక్ష్మీ నర్సింహ స్వామి ఆలయం భక్తులకు ఆధ్యాత్మిక చింతన పెంపొందిస్తోంది. ఎత్తిపోతల పర్యాటక ప్రాంతంగా పేరుగాంచింది. మర్రిగూడ మండల పరిధిలోని అజ్జలాపురం బుగ్గ వద్ద జలపాతం వర్షాకాలం మొదలుకుని ఆరు నెలల పాటు పర్యాటకులను కనువిందు చేస్తుంది.

ప్రకృతి అందాలకు దాసోహం

మర్రిగూడ మండల కేంద్రం నుంచి 10కిలోమీటర్ల దూరంలో ఈ బుగ్గ ఉంది. ఈ ప్రాంతమంతా కొండలు, లోయలు, పచ్చనిచెట్లతో కూడుకుని ఉంటుంది. వరద నీరంతా ఒకేచోట చేరి కొండపై నుంచి కిందకు దూకుతూ జలపాతాన్ని తలపిస్తుంటుంది. గత ఐదు రోజులుగా నీటి ప్రవాహం వస్తుండడంతో యువకులు, పరిసర ప్రాంతాల ప్రజలు ఇక్కడకు చేరుకుని సందడి చేస్తుంటారు.

గుహ మధ్యలో వెలసిన శివలింగం

మర్రిగూడ పరిసర ప్రాంతాల నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచి, హైదరాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల నుంచి కూడా నిత్యం వందల సంఖ్యలో జలపాతం వస్తున్న సమయంలో వచ్చి వెళ్తుంటారు. యువత ఇక్కడ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించుకుంటారు. ఈ జలపాతం దగ్గరకు వెళ్లాలంటే అజ్జలాపురం గ్రామం నుంచి సుమారు 2కి.మీ మేరకు కాలినడక ప్రయాణం చేయాల్సి ఉంటుంది. కాలినడకన వెళ్లే మార్గంలో వివిధ పక్షుల రాగాలు కాలినడక అలసటను మైమరపింపజేస్తాయి. ఈ ప్రాంతంలో కొలువైన శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఉంటుంది. ఇక్కడ కొండల నడుమ గుహ మధ్యలో శివలింగం కూడా వెలిసింది. ఈ ప్రాంతానికి వచ్చివారు స్వామివారి దర్శనం చేసుకుంటారు. ఇక్కడ పెద్దఎత్తున మొగలి చెట్లు ఉండడంతో ఈ ప్రాంతమంతా మొగలి పూల సువాసన వెదజల్లుతుంది.

శివారెడ్డిగూడెంలో 'కృష్ణ ఫ్రమ్ బృందావనం కాలనీ'

భూదాన్‌పోచంపల్లి: భూదాన్ పోచంపల్లి మండలంలోని శివారెడ్డిగూడెం గ్రామ శివారులో బుధవారం 'కృష్ణ ఫ్రమ్ బృందావనం కాలనీ' సినిమా షూటింగ్ నిర్వహించారు. హీరో ఆది సాయికుమార్, పలువురు జూనియర్ ఆర్టిస్టులతో పలు సన్నివేశాలు చిత్రీకరించినట్లు దర్శకుడు వీరభద్రం చౌదరి తెలిపారు.



చిత్రీకరణలో హీరో ఆది సాయికుమార్, జూనియర్ ఆర్టిస్టులు

అబ్దుల్ కలాం స్ఫూర్తితో చదవాలి



విద్యార్థులకు గోల్డ్‌మెడల్ ప్రదానం చేస్తున్న తెలుగు ప్రొఫెసర్ రాములు

- హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు ప్రొఫెసర్ రాములు

నకిరేకల్: విద్యార్థులు అబ్దుల్ కలాం స్ఫూర్తితో చదవాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు అన్నారు. నకిరేకల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన ప్రపంచ విద్యార్థుల దినోత్సవం, గోల్డ్‌మెడల్ ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉన్నతమైన కళ, జ్ఞాన సముపార్జన, నిరంతరం శ్రమ, పట్టుదల ఈ నాలుగు నియమాలు అనుసరిస్తే ప్రతి విద్యార్థి అత్యున్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాజధానిలోని కళాశాలలతో పోటీ పడుతుండడం అభినందనీయమన్నారు. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు కళాశాలలో దాతల సహకారంతో మూడు గోల్డ్ మెడల్స్ ఇవ్వడం అభినందనీయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బెల్లి యాదయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నల్లగొండ ఎన్జీ కళాశాల, రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు ఎస్.ఉపేందర్, రహత్ ఖానం, ప్రోగాం కన్వీనర్ శ్రీనివాసాచారి, వైస్ ప్రిన్సిపాల్ నాగు, అధ్యాపకులు ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, హరిత, మధుసూదన్‌రెడ్డి, శంకర్, రవీందర్, నర్సింహాచారి, శివశంకర్ పాల్గొన్నారు.

శ్రీగంధం చెట్లను నరికి చోరీకి పాల్పడుతున్న ముగ్గురి అరెస్టు

- 11 శ్రీగంధం దుంగలు, మూడు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు, ఫెన్సింగ్ వైర్ కట్టర్ స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ: రైతులు తోటల్లో పెంచుతున్న శ్రీగంధం చెట్లను నరికి చోరీకి పాల్పడుతున్న ముగ్గురు అంతర్ రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. కేసు వివరాలను బుధవారం నల్లగొండలోని డీఎస్పీ కార్యాలయంలో ఆయన వెల్లడించారు. బుధవారం ఉదయం కనగల్ సమీపంలో రెండు బైక్‌లపై వెళ్తున్న ముగ్గురు వ్యక్తులు వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి అక్కడి నుంచి పరారయ్యేందుకు యత్నించారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకుని తనిఖీ చేయగా వారి వద్ద చెట్లు నరికే పరికాలను గుర్తించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గందిగామ్ గ్రామానికి చెందిన దివానా, అరుద్యా గ్రామానికి చెందిన దద్దసింగ్, సుగువా గ్రామానికి చెందిన మజాన్‌లుగా గుర్తించారు. వీరి వద్ద 11 శ్రీగంధం మొద్దులు (దుంగలు), మూడు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు, మూడు రంపాలు, రెండు గొడ్డళ్లు, ఫెన్సింగ్ వైర్ కట్టర్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన మరో ముగ్గురు నిందితులు అన్నాబౌ లక్ష్మణ్ గైక్వాడ్, జవాస్, అజుబాలు పరారీలో ఉన్నట్లు చెప్పారు. సమావేశంలో సీఐ ఆదిరెడ్డి, ఎస్‌ఐలు సైదాబాబు, వెంకన్న, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలికను వేధించిన వ్యక్తికి ఏడేళ్ల జైలు

రామగిరి(నల్లగొండ): బాలికను వేధించిన వ్యక్తికి ఏడు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ పోక్సో కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి రోజారమణి బుధవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా మోతె మండలం సిరికొండ గ్రామానికి చెందిన ఉప్పుల నాగార్జున 2019లో వివాహ శుభకార్యానికి వెళ్లాడు. అక్కడ ఆడుకుంటున్న బాలికను పిలిచి లైంగికంగా వేధిస్తుండగా కుటుంబ సభ్యులు చూసేసరికి అక్కడి నుంచి పారిపోయాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేతేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ వాదనలతో ఏకీభవించిన జడ్జి రోజారమణి నిందితుడికి మూడు సెక్షన్‌ల కింద ఏడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. బాధిత కుటుంబానికి రూ.7లక్షల పరిహారం చెల్లించాలని సూచించారు. కోర్టుకు సాక్ష్యాధారాలు సమర్పించడంలో లైజన్ అధికారులు నరేందర్, మల్లిఖార్జున్, కోర్టు కానిస్టేబుల్ కిరణ్‌కుమార్ సహకరించారు.

ఒక్కో వాహనం చోరీకి ఏడాది చొప్పున..

నిడమనూరు : మూడు ద్విచక్ర వాహనాలు చోరీ చేసిన ఘటనలో ఒక్కో వాహనానికి గాను ఏడాది చొప్పున మొత్తం మూడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు తీర్పునిచ్చింది. నల్లగొండ జిల్లా అనుముల మండలంలోని అలీనగర్‌కు చెందిన మహ్మద్ జాని ఈ ఏడాది జూన్ 19న, జూలై 12, 16, 25 తేదీల్లో హాలియా బస్టాండ్‌లో నిలిపిన నాలుగు ద్విచక్ర వాహనాలను చోరీ చేశాడు. బాధితులు గాయం శంకర్, లింగంపల్లి సత్యనారాయణ, గొర్ల సైదయ్య, కున్‌రెడ్డి ప్రభాకర్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సాయి ప్రశాంత్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. పోలీసులు నిందితుడిపై సరైన సాక్ష్యాధారాలు సమర్పించారు. ఈమేరకు నిడమనూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి స్వప్న సాక్షులను విచారించి నిందితుడికి ఒక్కో వాహనం చోరీకిగాను ఏడాది చొప్పున మూడు వాహనాలకు మూడేళ్ల జైలు శిక్ష విధించారు. నాలుగో వాహనం చోరీ కేసులో రెండు నెలల 10 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ సాధన వాదనలు వినిపించారు.

రైలు నుంచి పడి తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు మృతి



వెంకటేశ్వర్లు (ఫైల్)

గరిడేపల్లి: మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామానికి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు కీత వెంకటేశ్వర్లు బుధవారం వ్యక్తిగత పనులపై ఢిల్లీ వెళ్తుండగా మార్గమధ్యలో జార్ఖండ్ రాష్ట్రంలోని కదారు ప్రాంతంలో ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి మృతి చెందారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ఈ ప్రాంతం నుంచి చురుకైన పాత్ర పోషించారు. వెంకటేశ్వర్లు మృతి పట్ల మండల బీఆర్ఎస్ నాయకులు సంతాపం తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

మునగాల: మండలంలోని ఆకుపాముల శివారులో జాతీయ రహదారిపై బుధవారం గుర్తు తెలియని కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కోదండరామాపురం గ్రామానికి చెందిన రెణబోతు అప్పిరెడ్డి, రెణబోతు లక్ష్మీనరసింహారెడ్డి ఇద్దరు సోదరులు. లక్ష్మీనరసింహారెడ్డికి చెందిన ద్విచక్రవాహనంపై అప్పిరెడ్డితో కలిసి కోదాడ మండలం కందిబండ గణపవరం గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. మార్గమధ్యంలో ఆకుపాముల వద్ద విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే కారు అతివేగంగా వచ్చి వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. గాయపడిన వీరిద్దరిని స్థానికులు చికిత్స నిమిత్తం కోదాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న వారి కుటుంబసభ్యులు కోదాడకు చేరుకొని మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మంకు తరలించారు. ఈ విషయమై స్థానిక ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌ను సంప్రదించగా ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

25లోగా సెమిస్టర్ల పరీక్ష ఫీజు చెల్లించాలి

నల్లగొండ టూటౌన్: మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం పరిధిలోని బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఏ అభ్యసిస్తున్న 1, 3, 5 సెమిస్టర్లకు చెందిన విద్యార్థులు ఈ నెల 25లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని ఎంజీ యూనివర్సిటీ సీఓఈ ఉపేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 ఆలస్య రుసుముతో ఈనెల 27లోగా పరీక్ష ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

పరిశోధనలే సమాజానికి దిక్సూచి

- ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్



మాట్లాడుతున్న ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్: పరిశోధనలే సమాజానికి దిక్సూచి అని మహాత్మా గాంధీ యూనివర్సిటీ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. నల్లగొండలోని ఎంజీ యూనివర్సిటీలో ఐక్యూ ఏసీ ఆధ్వర్యంలో 2028లో జరగనున్న మూడవ విడత నాక్ మూల్యాంకనంపై బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ.. అధ్యాపకులు పరిశోధనలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతి అధ్యాపకుడు విద్యార్థులను పరిశోధనల వైపు ప్రోత్సహించాలన్నారు. నాక్ ఏ గ్రేడ్ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. సమావేశంలో గోపికృష్ణ, గోనారెడ్డి, అల్వాల రవి, మిరియాల రమేష్, కొప్పుల అంజిరెడ్డి, రేఖ, అన్నపూర్ణ, ఆకుల రవి, సుధారాణి, శ్రీదేవి, అరుణప్రియ పాల్గొన్నారు.

రాష్ట్ర హక్కులను కాపాడుతాం

- రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

కోదాడ: కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్ర హక్కులను కాపాడేందుకు ఎంత వరకైనా వెళ్తామని ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి కోదాడలో విలేకరులతో మాట్లాడారు. ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్ట్‌ను ప్రతిపాదిస్తున్నదని తెలుసుకున్న వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేంద్ర జలవనరులశాఖకు, కేంద్ర ప్రభుత్వానికి తమ వ్యతిరేకతను తెలియజేశామని అన్నారు. రాష్ట్ర నీటిపారుదశాఖ మంత్రి హోదాలో తాను న్యాయస్థానంలో హాజరయ్యానని తెలిపారు. ప్రజల్లో అపోహలు కలిగించడానికి ప్రతిపక్షనేతలు అసత్య ప్రచారాలను చేస్తున్నారని ఆరోపించారు. కృష్ణా జలాల విషయంలో గత ప్రభుత్వం 811 టీఎంసీలలో 299 టీఎంసీలు తెలంగాణకు సరిపోతాయని ఒప్పుకుందన్నారు. తమ ప్రభుత్వం 811 టీఎంసీలలో తెలంగాణకు 70శాతం నీటివాటా కావాలని పోరాడుతోందని చెప్పారు. వచ్చే ఎన్నికల నాటికి ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తి చేసి నీటిని అందిస్తామని దీనికి ఇప్పటికే రూ.4300 కోట్లు కేటాయించామని తెలిపారు. సొరంగం తవ్వకంలో ప్రమాదం జరిగి పనులు ఆగిపోయాయని, దేశంలోనే ఉత్తమ సొరంగ నిపుణులను తీసుకొచ్చి పనులను ప్రారంభించడానికి కృషి చేస్తున్నామన్నారు. డిండి ప్రాజెక్ట్‌కు రూ.1800 కోట్లను కేటాయించి పనులు చేయబోతున్నామని తెలిపారు. గోదావరి జలాలను శ్రీరాంసాగర్ ఫేజ్-2 ద్వారా సూర్యాపేట జిల్లాకు తీసుకొస్తామని తెలిపారు. ఈ సంవత్సరం వానాకాలంలో రాష్ట్రంలో 67 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారని, 148. 8 లక్షల టన్నుల ధ్యానం పండబోతున్నదని, దీనిలో 87 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని వివరించారు. దీని కోసం 8432 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు వాటిలో అన్ని సౌకర్యాలను కల్పించామని తెలిపారు. సమావేశంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వం

- ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



సంతకాలు చేసిన ప్రతులను చూపుతున్న ఎంపీ చామల కిరణ్, ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం: దొంగ ఓట్లను సృష్టించి అధికారంలోకి రావడమే లక్ష్యంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ దోపిడీకి పాల్పడుతుందని, రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'రైజ్ యువర్ వాయిస్' అనే నినాదంతో 'ఓటు చోరీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీకి మద్దతుగా దేశం బాగు కోసం మా సంతకం ' అనే కార్యక్రమాన్ని బుధవారం శాలిగౌరారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారం కోసం ప్రజల రాజ్యాంగ హక్కులను హరిస్తూ ఓట్ల దొంగతనానికి పాల్పడుతుందని విమర్శించారు. అనేక రాష్ట్రాల్లో ఓట్లచోరీతో అధికారం చేపట్టిన బీజేపీ ఇప్పుడు బిహార్‌లోనూ అదేవిధంగా కార్యాచరణ చేపట్టిందన్నారు. ఓట్లచోరీకి వ్యతిరేకంగా జరిగే సంతకాల సేకరణ కార్యక్రమాన్ని తనకు ఓటుహక్కు కలిగి ఉన్న సొంత గ్రామంలోని అదే బూత్ పరిధిలో సంతకాల సేకరణ ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ తాళ్లూరి మురళి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నరిగె నర్సింహ, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ చామల మహేందర్‌రెడ్డి, పీసీసీ మాజీ అధికార ప్రతినిధి నూక కిరణ్‌యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షులు అన్నెబోయిన సుధాకర్, గంట్ల వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శి గూని వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు ఎర్ర చైతన్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గణేశ్ పాల్గొన్నారు.

సీఎం, మంత్రులకు రైతుల బాధలు పట్టడం లేదు

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



రామన్నపేట వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న చిరుమర్తి లింగయ్య

రామన్నపేట: సీఎం, మంత్రులకు రాజకీయాలు తప్ప.. రైతుల బాధలు పట్టడం లేదని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. బుధవారం రామన్నపేట మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు దళారులకు అమ్మి నష్టపోతున్నారన్నారు. మంత్రుల మధ్య సమన్వయలోపం ప్రజలకు శాపంగా మారిందన్నారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా యుద్ధ ప్రాతిపదికన ధాన్యాన్ని కొనుగోలు చేసి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోచబోయిన మల్లేశం, మాజీ ఎంపీపీ నీల దయాకర్ నాయకులు బందెల రాములు, వేమవరపు సుధీర్‌బాబు, గొరిగె నర్సింహ, బద్దుల ఉమారమేష్, సాల్వేరు అశోక్, ఎస్‌కే చాంద్, మిర్యాల మల్లేశం, జాడ సంతోష్, బొడ్డు అల్లయ్య, లవనం రాము, దండుగుల సమ్మయ్య, ఎండీ ఎజాజ్, ఆవుల శ్రీధర్, గర్దాసు విక్రం, రాస వెంకటేశ్వర్లు, బుర్ర శ్రీశైలం, ఎండీ మోసబ్, సైదులు, ఎండీ అంజద్, బాబు, నరేష్, గణేష్, ఖలీం, యాదయ్య, లింగయ్య ఉన్నారు.

భూ నిర్వాసితులకు రాచకొండలో భూములివ్వాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి



చౌటుప్పల్ : జంక్షన్ ప్రాంతంలోని భూములను పరిశీలిస్తున్న పల్లా వెంకట్‌రెడ్డి, నెల్లికంటి సత్యం

చౌటుప్పల్ : రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులకు పరిహారంగా రాచకొండలోని భూములు ఇవ్వాలని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చౌటుప్పల్‌లో నిర్మించనున్న ట్రిపుల్‌ఆర్ జంక్షన్ ప్రాంతాన్ని బుధవారం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి సందర్శించారు. రీజినల్ రింగ్‌రోడ్డు కోసం గుర్తించిన పొలాలు, వెంచర్లను పరిశీలించారు. భూనిర్వాసితులను కలిసి వారి నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివీస్, శ్రీని పరిశ్రమలను కాపాడేందుకు అలైన్‌మెంట్‌ను చౌటుప్పల్ ప్రాంతంలో 10కిలోమీటర్లు వంకర్లుగా మార్చారని ఆరోపించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తక్షణమే చౌటుప్పల్‌లో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ మార్గాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, సహాయకార్యదర్శి సత్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు పల్లె శేఖర్‌రెడ్డి, బచ్చనగోని గాలయ్య, నిర్వాసితులు బోరెం ప్రకాష్‌రెడ్డి, వల్లూరి బోవయ్య, సందగళ్ల మల్లేష్, జాల శ్రీశైలం పాల్గొన్నారు.

భూనిర్వాసితుల మద్దతుకు సీపీఐ ఉద్యమిస్తుంది

సంస్థాన్ నారాయణపురం: రీజినల్ రింగ్ రోడ్డు భూనిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ వారికి మద్దతుగా సీపీఐ ఉద్యమిస్తుందని ఆపార్టీ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సంస్థాన్‌నారాయణపురం మండలంలోని రీజినల్ రింగ్ రోడ్డు వెళ్తున్న దేవిరెడ్డిబంగ్లా, పుట్టపాక గ్రామాల్లో పర్యటించి పొలాలు పరిశీలించారు. ఉత్తర భాగం విషయమై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని కలుస్తామన్నారు. దక్షిణ భాగం భూనిర్వాసితులతో ప్రభుత్వ పెద్దలను కలుస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, పార్టీ మండల కార్యదర్శి దుబ్బక భాస్కర్, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని నారాయణరావు, నాయకులు తదితరులున్నారు.


బైక్‌ల చోరీ ముఠా అరెస్ట్



నిందితులను చూపుతున్న పట్టణ ఇన్‌స్పెక్టర్

భువనగిరిటౌన్ : బైక్‌ల చోరీ ముఠాను భువనగిరి పట్టణ పోలీసులు పట్టుకున్నారు. కేసు వివరాలను బుధవారం భువనగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పట్టణ ఇన్‌స్పెక్టర్ రమేష్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని యాకుత్‌పుర చెందిన సయ్యద్ తలీబ్ అలియాస్ సమీక్(ఏ1) అలూబా(ఎ2), రేహన్ (ఏ3), ఎండీ సాజిద్(ఏ4)తోపాటు వికారాబాద్ జిల్లా పూడూరు మండలం గోమల్ గ్రామానికి చెందిన మహ్మద్ షోయబ్ అలియాస్ శ్రీనివాస్(ఏ5) ముఠాగా ఏర్పడ్డారు. ప్రధాన నిందితుడు సయ్యద్ తలీబ్ గతంలో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడి జైలుకు వెళ్లి ఆగస్టులో బెయిల్‌పై విడుదలయ్యాడు. అతడికి పరిచయమున్న అలూబా, రేహన్, సాజిద్‌తో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. ఈ నలుగురు కలిసి ఇళ్ల ఎదుట పార్కింగ్ చేసి ఉన్న బైక్‌లను చోరీ చేసి వికారాబాద్ జిల్లాకు చెందిన షోయబ్‌కు ఇచ్చేవారు. అతడు తనకు తెలిసిన వాళ్లకు విక్రయించేవాడు. ఇలా వచ్చిన డబ్బును ఐదుగురు కలిసి సమాన వాటాగా పంచుకునేవారు. ఈనెల 6వ తేదీన భువనగిరిలో జరిగిన ద్విచక్రవాహనం చోరీ కేసులో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను సీసీ కెమెరాలో గుర్తించారు. ఈమేరకు హైదరాబాద్‌లో సయ్యద్ తలీబ్, సాజిద్, మహ్మద్ షోయబ్‌ను అరెస్ట్ చేసి భువనగిరి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. మిగతా ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పారు. పట్టుబడ్డ నిందితుల వద్ద రూ.4.80లక్షల విలువైన ఐదు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సైలు రమేష్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు తరలిన ఉమ్మడి జిల్లా జట్టు



ఉమ్మడి జిల్లా వాలీబాల్ క్రీడాకారుల జట్టు

భువనగిరి: హైదరాబాద్‌లోని పటాన్‌చెర్వులో ఈ నెల 16, 17, 18న జరగనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 వాలీబాల్ పోటీల్లో పాల్గొనేందుకు బుధవారం ఉమ్మడి జిల్లా బాలుర జట్టు బుధవారం భువనగిరి నుంచి బయలుదేరింది. డీఈఓ సత్యనారాయణ వారికి అభినందనలు తెలిపారు.

స్కూటీపై లిఫ్ట్ ఇచ్చి.. మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

శాలిగౌరారం: పొలం వద్దకు రోడ్డువెంట నడుచుకుంటూ వెళ్తున్న మహిళకు తన బైక్‌పై లిఫ్ట్ ఇచ్చి మార్గమధ్యంలో ఆమె మెడలో ఉన్న పుస్తెల తాడును దుండగుడు లాక్కెళ్లాడు. ఈ సంఘటన శాలిగౌరారం మండలంలోని మాధారంకలాన్-ఓగోడు రోడ్డులో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నకిరేకల్ మండలం ఓగోడు గ్రామానికి చెందిన ఆవుల సావిత్రమ్మ(55) మాధారంకలాన్ శివారులో తన వ్యవసాయ పొలానికి నడుచుకుంటూ వెళ్తోంది. మాధారంకలాన్ వైపు స్కూటీపై వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తి సావిత్రమ్మను చూసి వాహనాన్ని ఆపాడు. తాను కూడా మాధారం కలాన్ వెళ్తున్నానని చెప్పి ఆమెను స్కూటీపై ఎక్కించుకున్నాడు. చొల్లగూడెం వద్ద గల 365వ నంబర్ జాతీయ రహదారి జంక్షన్ సమీపంలోకి రాగానే స్కూటీని ఆపాడు. వాహనం దిగిన సావిత్రమ్మ నడుచుకుంటూ జంక్షన్ వైపు వస్తుండగా వెనుక నుంచి వచ్చి ఇనుపరాడ్‌తో సావిత్రమ్మ తలపై బలంగా కొట్టాడు. ఆమె మెడలో ఉన్న పుస్తెలతాడును లాక్కొని స్కూటీపై పరారయ్యాడు. కొద్దిసేపటి తర్వాత షాక్ నుంచి తేరుకున్న సావిత్రమ్మ తన కుమారుడు సైదులుకు ఫోన్‌చేసి జరిగిన విషయాన్ని చెప్పింది. అతడు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని తల్లిని నకిరేకల్‌లోని ఆస్పత్రికి తరలించాడు. సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.